రాలిన రైతు ఆశలు



- వర్షాలకు రాలిన పప్పుశనగ పూత
- కొత్త పూతపైనే అన్నదాతల ఆశలు



పూతరాలిన దృశ్యం

పెద్దపప్పూరు: వర్షాధారం కింద సాగుచేసిన పప్పుశనగ పంటలో ఇటీవల కురిసిన వర్షానికి పూర్తిగా పూత రాలిపోయింది. దీంతో అన్నదాతల ఆశలు అడియాసలయ్యాయి. పెద్దపప్పూరు మండలంలోని చీమలవాగుపల్లి, నరసాపురం, కుమ్మెత, సుంకేసులపల్లి, కొట్టాలపల్లి, దర్మాపురం, సోమనపల్లి, అత్తిరాలదిన్నె తదితర గ్రామాల్లో వ్యవసాయ అధికారుల రికార్డుల మేరకు దాదాపు 3,500 ఎకరాల్లో 1,300ల మంది రైతులు వర్షాధారం కింద నల్లరేగడి భూముల్లో పప్పుశనగపంట సాగుచేశారు. ఇటీవల కురిసిన తుపాను వర్షాలకు పప్పుశనగ పంటలో పూత నేలరాలింది. కొత్త పూత పూసినా ఆశించిన దిగుబడి రాకపోవచ్చని రైతులు వాపోయారు. కనీసం పెట్టుబడులన్నా వస్తాయా? లేదా? అన్న సందేహం అన్నదాతల్లో నెలకొంది. సన్న, చిన్నకారు రైతులు అందిన చోట్ల అప్పులు చేసి పంట సాగుచేశారు. పంటకు తెగుళ్ల సోకకుండా వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేశామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

పెండేకల్లు సమీపంలో సాగుచేసిన పప్పుశనగ పంట

పప్పుశనగ సాగు ఇలా	
మండలం	ఎకరాలు
తాడిపత్రి	3,820
పెద్దపప్పూరు	3,500
పెద్దవడుగూరు	200
యాడికి	1335



22 ఎకరాల్లో సాగు చేశా

22 ఎకరాల్లో వర్షాధారం కింద పప్పుశనగ పంటను రెండునెలల క్రితం సాగుచేశాను. 10 రోజుల క్రితం వరకూ పూతదశలో ఉన్న పంటను చూసి ఈ ఏడాది ఆశించిన దిగుబడికంటే ఎక్కువ వస్తుందని అనుకున్నా. వర్షం కారణంగా పూత పూర్తిగా నేలరాలింది. కొత్త పూత పూసినా పెట్టుబడి వస్తుందో? లేదో? అన్న అనుమానం ఉంది.

– నాగలింగేశ్వర్ రెడ్డి, రైతు, పెండేకల్లు



రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టా

ఎకరాకు రూ.1500 చొప్పున దాదాపు 20 ఎకరాల్లో రూ.2.50 లక్షల వ్యయంతో పప్పుశనగ పంట సాగు చేశాను. ఇటీవల కురిసిన వర్షానికి పూతరాలిపోయింది. కొత్తపూత వచ్చినా 15 శాతం మాత్రమే దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. భవిష్యత్‌లో పప్పుశనగ పంట సాగు చేయాలంటే భయంగా ఉంది.

– రైతు రామక్రిష్ణా రెడ్డి, పెండేకల్లు



పూత మళ్లీ వస్తుంది

మండల వ్యాప్తంగా వర్షాధారం కింద 1300 మంది రైతులు 3500 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. ముందస్తుగా సాగు చేసిన పంటలో వర్షానికి పూతరాలింది. వెనుకసారి సాగుచేసిన పంట ప్రస్తుతం పూతదశకు వచ్చింది. పూత రాలిపోయినా కొత్త పూత వస్తుంది. కాకపోతే దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి.

– ఆంజనేయులు, ఏఓ, పెద్దపప్పూరు

క్లుప్తంగా

పశువుల షెడ్ల నిర్మాణం నాణ్యతగా ఉండాలి



వెస్ట్ నరసాపురంలో పశువుల షెడ్‌ను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

శింగనమల: ఉపాధి పథకం కింద పశువుల షెడ్లు నాణ్యతగా నిర్మించేలా సిబ్బంది పర్యవేక్షించాలని డీడబ్ల్యూఎంఏ పీడీ సలీంబాషా సూచించారు. గురువారం మండలంలోని ఆకులేడు, వెస్ట్ నరసాపురం గ్రామాల్లో పశువుల షెడ్లు, ఫీడర్ చానల్లు నిర్మాణం పనులను పరిశీలించారు. పనులను త్వరితగితన పూర్తి చేయించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఏపీఓ శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణస్వామి, ఓబిలేసు, అలివేలమ్మ పాల్గొన్నారు.

'కరువు మండలాలుగా ప్రకటించాలి'



మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి

గుత్తి: జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు ప్రాంతాలుగా ప్రటించాలని ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. శుక్రవారం అనంతపురంలో జరగనున్న రైతు పోరాటానికి అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోషల్ మీడియా నాయకులు వరదరాజులు, బ్రహ్మారెడ్డి, సుబ్బయ్య ఆచారి, జ్ఞానేశ్వర్ రెడ్డి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోల్ బంక్ ఏర్పాటకుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ

గుత్తి: పట్టణంలోని పోలీసు క్వార్టర్స్ ఏరియాలో త్వరలో ఏర్పాటు చేయబోతున్న పోలీస్ పెట్రోల్ బంక్ ఏర్పాటు స్థలాన్ని గురువారం అనంతపురం ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇంతియాజ్ బాషా పరిశీలించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ నాగమాణిక్యం, ఐఓసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వాసుదేవరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: ప్రతి ఉద్యోగీ హాజరు పట్టికలో సంతకాలు చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. మండలంలోని పెద్దమల్లేపల్లి సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తనిఖీ చేశారు. గురువారం సాక్షి పత్రికలో ప్రచురితమైన 'పట్టించుకునే వారేరీ' అన్న కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికతో పాటు సచివాలయ రికార్డులు, లీవ్ లెటర్లు పరిశీలించారు. సచివాలయంలో నెలకొన్న సమస్యలపై ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరై సాయంత్రం ఐదు గంటల వరకూ విధుల్లో ఉండాలన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు



మౌనికకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్

పెద్దపప్పూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ ప్రాణాలు పోలీసులు కాపాడారు. వివరాలు.. మండలంలోని తురకపల్లికి చెందిన మౌనికను నార్పల గ్రామం చెందిన వడ్డే శివకు ఇచ్చి నాలుగేళ్ల కిందట వివాహం చేశారు. కుటుంబ కలహాలతో ఆమె ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె చాగల్లు డ్యాంలోకి దూకాలని ప్రయత్నం చేస్తుండగా స్థానికులు గుర్తించి ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి సందర్శించి ఆమె తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి మౌనికను అప్పజెప్పారు. సకాలంలో పోలీసులు రావడంతో తమ బిడ్డ ప్రాణాలతో బయట పడిందని కుటుంబ సభ్యులు అన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

పామిడి/పెద్దవడుగూరు/యల్లనూరు: పంచాయతీల అభివృద్ధే లక్ష్యమని డీపీఓ నాగరాజునాయుడు అన్నారు. పామిడిలోని ఎంపీడీఓ సభాభవనంలో గురువారం రెండో రోజు ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాండర్డ్ డెవలప్‌మెంట్ గోల్ (ఎస్‌డీజీ) కార్యక్రమానికి డీపీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 17 అంశాలతో కూడిన ఈ అభివృద్ధి లక్ష్యాలను పాటించడం వల్ల పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించడానికి అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం పంచాయతీల అభ్యున్నతికి పాటుపడే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణకుమార్, మండలస్థాయి అధికారులు, అనధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బందికి రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, ఎంపీడీఓ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా యల్లనూరులో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఈఓఆర్డీ మనోహర్, ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, వ్యవసాయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ లలితాబాయి, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి, ఏఓ నాగభూషణరెడ్డి, సీహెచ్‌ఓ గంగాధర తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు

తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు/యల్లనూరు/పామిడి: సాగునీటి సంఘాల ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. తాడిపత్రిలోని రెవెన్యూ భవన్‌లో గురువారం ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల పీఓలు, ఏపీఓలు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. వాటిలో చిన్నపాలమడ, పెద్దపాలమడ, దిగువపల్లి, నందలపాడు, భోగసముద్రం, వెంకటాంపల్లి, వంగనూరు, ఆలూరు, బ్రహ్మణపల్లిలు ఉన్నాయన్నారు. ఈ నెల 14న ఎన్నికల కోసం 78 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పెద్దవడుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మైనర్ ఇరిగేషన్ కింద భూములున్న రైతులకు చిత్రచేడు, అప్పేచర్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో, మేజర్ ఇరిగేషన్ కింద పెద్దవడుగూరు, మిడుతూరు, దిమ్మగుడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా యల్లనూరు తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. పీబీసీ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి, తహసీల్దారు రాజా మాట్లాడుతూ యల్లనూరు, కల్లూరు, తిరుమలాపురం, వేములపల్లి పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, పీబీసీ, టీబీసీ అధికారులు, ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పామిడితో పాటు ఎద్దులపల్లి గ్రామాల్లోని రెండు పెద్దకాలువలకు, మైనర్ ఇరిగేషన్ కింద రామగిరి, పాళ్యం, అనుంపల్లి గ్రామాల చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తామని పామిడి తహసీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు. పామిడి, ఎద్దులపల్లి పెద్దకాలువలకు 12 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు కాగా, అలాగే పై మూడు గ్రామాల చెరువులకు ఆరుగురు చొప్పున ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు ఉంటారన్నారు. పామిడి నీటిసంఘం ఎన్నిక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఎద్దులపల్లి ఎన్నిక జెడ్పీ హైస్కూల్‌లో, పై మూడు చెరువుల ఎన్నికలు ఆయా గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలో ఉంటాయన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు.



తాడిపత్రిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రజాక్‌వలి

మాలధారులకు అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మాలధారులకు గురువారం ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయంలో అయ్యప్ప స్వాముల 35వ గ్రామోత్సవం సందర్భంగా ఎంపీపీ దంపతులు అన్న ప్రసాదాలకు పూజ చేశారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, రామ్మోహన్, వార్డు సభ్యులు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజినేస్వామి సమీపంలోని వాసవీ ఆర్యవైశ్య సత్ర సముదాయంలో హనుమద్ వ్రతం సందర్భంగా వందలాది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు గోపా జగదీష్, కృపాకర్, టీడీపీ నాయకుడు ఆర్.పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు నెట్టికంటి మాలదారులతోపాటు భక్తులకు భోజనం వడ్డించారు. ర్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యనారాయణపేటలో పాలసుధాకర్ ఆధ్వర్యంలో మాలదారులకు పండ్లు, పాలు, తాగునీరు ఉచితంగా అందజేశారు.



యాడికిలో భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ దంపతులు

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

గుంతకల్లుటౌన్/పెద్దపప్పూరు: పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ గురువారం గుంతకల్లులోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలతో కూడిన బిల్లు కాపీలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు ప్రకటించిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగ్గిలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్ర, జ్యోతి, అబ్దుల్లా, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరులో సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచేసిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నాగిరెడ్డి, రైతు సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

దివ్యాంగులను చులకనగా చూడొద్దు

గుత్తి: దివ్యాంగులను ఎవరూ చులకనగా చూడొద్దని కమిషనర్ జబ్బార్‌మియా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీరెడ్డి అన్నారు. గుత్తిలోని గౌతమిపురి వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అంతకుముందు ఎస్ఐ సురేష్ జెండా ఊపి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌతమిపురి దివ్యాంగుల మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేష్, సభ్యులు రవి కుమార్, ఆది పాల్గొన్నారు.

'ర్యాలీ జయప్రదం చేయండి'

పామిడి: కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న రైతు సమస్యలపై పోరుబాట ప్రదర్శన కార్యక్రమం జయప్రదం చేయాలని జెడ్పీటీసీ ఎల్.శోభ గురువారం తెలిపారు. పంటలకు మద్దతు ధర, పెట్టుబడి సాయం, పంటల బీమా, ఇతర రైతు సమస్యలపై ఉదయం 10 గంటలకు అనంతపురంలో జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మేధావులు, ప్రజలు, వైఎస్ అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

తొండపాడులో పశు గర్భకోశ చికిత్స శిబిరం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో గురువారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వైద్యుడు సుధాకర్, జక్కలచెరువు పశు వైద్యుడు ప్రదీప్ కృష్ణ గ్రామంలోని పశువులను పరీక్షించారు. 90 శాతం కచ్చితత్వంతో పెయి దూడలు పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏహెచ్‌ఏలు సాల్మన్‌రాజు, అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

బుక్కరాయసముద్రం: మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో 17వ విడత సామాజిక తనిఖీ శుక్రవారం ప్రారంభిస్తామని ఎంపీడీఓ సాల్మాన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పథకం అమలులో భాగంగా 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31 వరకూ చేపట్టిన పనులపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 19 పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై శుక్రవారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ లక్ష్మీ నారాయణ, ఏపీఓ పోలేరయ్య, సుజాత, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎండు తెగులు నివారించుకోండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా రైతులు సాగు చేసిన పప్పుశనగ పంట ఎండుముఖం పడుతోందని, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసి నివారించుకోవాలని వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పప్పుశనగ పంటను ఆయన పరిశీలించారు.

నివాళి



మృతదేహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి

యాడికి: మండలంలోని చిక్కేపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ఉప కన్వీనర్ జోగిరెడ్డి గారి చిన్న(జేసీ) నారాయణ రెడ్డి అనారోగ్యంతో కర్నూలులోని ఆస్పత్రిలో బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి గురువారం ఉదయం చిక్కేపల్లి గ్రామానికి వెళ్లి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే తాడిపత్రి మునిసిపల్ మాజీ చైర్మన్ పేరం నాగిరెడ్డి, మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, చిక్కేపల్లి సర్పంచు నాగలక్ష్మమ్మ, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, నాయకులు జయకృష్ణ, కోయిల కుంట్ల రామకృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

వాహనాల తనిఖీ

తాడిపత్రి రూరల్: మండలంలోని పలు చోట్ల గురువారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. తరుచుగా జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఆటోలు, ద్విచక్ర వాహనాలు తదితర వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను ఆయన హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా హనుమాన్ జయంతి

యల్లనూరు: మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు బాలాజీ స్వామి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, హోమాలు, సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాతిదూలం పోటీలను ప్రారంభిస్తారని సర్పంచు పెద్దనాగరాజు తెలిపారు.

హైందవ శంఖారావం ప్రతుల పంపిణీ

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో విశ్వహిందూ పరిషత్, మండల రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావానికి సంబంధించిన ప్రతులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమం జయప్రదం కావాలని ఆలయంలో హిందూ హారతి కార్యక్రమం చేపట్టారు. ఆసంఘ నాయకులు చౌడయ్య, రవి బాబు, శ్రీనివాసులు, జోజోడే కుమార్, రవిపాల్గొన్నారు.

ఆటో చోరీ

తాడిపత్రిటౌన్: పట్టనంలోని చేపలమార్కెట్ సమీపంలో నివసిస్తున్న మల్లేష్‌కు చెందిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పండ్ల వ్యాపారం చేసుకునే మల్లేష్ బుధవారం రాత్రి ఆటోను ఇంటి ఆవరణలో ఉంచి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో.. గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దత్త నవరాత్రి ఉత్సవాలు

పామిడి: పట్టణంలోని వడ్డేవీధిలో ఉన్న మహాయోగ దత్తపీఠంలో గురువారం ఆ పీఠాధిపతి సురేంద్ర మహరాజ్ ఆధ్వర్యంలో దత్త నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్రాతేయుని, అమ్మవారి విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. దత్తాత్రేయ, శివ రుద్రాభిషేకం చేశారు. అరుణ కలశ పూజలు, దత్త అష్టోత్తర శతనామవాళి, పుష్ప అర్చన నిర్వహించారు. దత్తహోమం ఆచరించారు.

రస్తా సమస్య పరిష్కారం

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో తోటలకు వెల్లే రస్తా సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. మంగళవారం 'రస్తా సమస్యను పరిష్కరించండి' అన్న కథనానికి స్పందించిన తహసీల్దారు రాజా, మండల సర్వేయర్ షర్వానీ క్షేత్రస్థాయిలో గురువారం సర్వే చేసి రైతుల పొలాలకు వెళ్లేందుకు దారి చూపించారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు మహేష్, శంకర్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

'భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం'

పెద్దవడుగూరు/యాడికి/గుంతకల్లు రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఉషారాణి అన్నారు. గురువారం పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం, విరుపాపురం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఆర్ఐ లహరిక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యాడికి మండలంలోని నిట్టూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ క్రిష్టప్ప, ఎండోమెంట్ ఈఓ దుర్గా ప్రసాద్, వీఆర్ఓలు పాల్గొన్నారు. అదేవిధంగా గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువులో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

పాత కక్షలతో ఘర్షణ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడు ఆంజనేయస్వామి మాన్యంలో గురువారం పాత కక్షల కారణంగా ఇరు కుటుంబాలకు చెందిన వారు ఘర్షణ పడ్డారు. కాలనీకి చెందిన హాజీవలి, ఆయన తండ్రి కమల్‌బాషాపై ఆదే కాలనీలో వున్న వెంకటాద్రి, పెద్దిరాజు, మాధవ్ గొడవ పడ్డారు. ఇరు కుటుంబాలు కట్టెలు, పైపులతో కొట్టుకోవడంతో హాజీవలి, కమల్‌బాషా, పెద్దిరాజుకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసి, వద్ద నుంచి రూ.29 వేలను స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి మండలంలోని పులిప్రొద్దుటూరు పొలిమేర రంగస్వామిరెడ్డి, చుక్కలూరు నాగయ్య, ఇస్మాయిల్, చిన్న ఓబులేసు, బోడాయిపల్లి మార్కాపురంరెడ్డి, బ్రహ్మణపల్లి కతాలప్ప, తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డుకు చెందిన తప్పల కేశవ, పల్లె గోపాల్‌రెడ్డి, బత్తుల శేఖర్, డి.శేఖర్, పెద్దపప్పూరు మండలం చీములవాగుపల్లి దస్తగిరిలని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

దిండి భజన బృందానికి సన్మానం

పామిడి: పట్టణంలోని రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో చిన్న విఠోబ దేవాలయంలో గురువారం దిండి భజన బృందానికి ఘనంగా సన్మానం చేశారు. కార్తీక మాసంలో నెలరోజుల పాటు వారు భక్తి గీతాలాపనలతో అలరించారు. ఈఓ క్రిష్ణయ్య, ఆలయ అధ్యక్షుడు టీటీ నాగభూషణ్‌రావు సమక్షంలో భజన మండలి అధ్యక్షుడు కే మురళీసుందర్, సభ్యులను సత్కరించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

పామిడి: కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన పామిడిలో విద్యార్థులతో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలైనా తల్లికి వందనం, వసతిదీవెన, విద్యాదీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్, ప్రజాసంక్షేమ పథకాలు, సంరక్షణ, ఇతరత్రా విద్యాపరమైన సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామంటూ వారిచ్చిన సూపర్‌సిక్స్ హామీల నుంచి దృష్టి మళ్లించాలన్నది ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలను డైవర్ట్ చేయడాన్ని మానుకుని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన హితవు పలికారు.

వాకర్స్ సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే గ్రౌండ్‌లో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు డీఆర్ఎం విజయ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ నాయకుడు అంజి తదితరులు మాట్లాడుతూ చిన్నపాటి వర్షం వచ్చినా గ్రౌండ్‌లో వర్షపు నీరు నిలబడుతోందన్నారు. దీంతో వాకింగ్ చేసే సమయంలో వృద్ధులు, మహిళలు, స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు కిందపడి గాయపడుతున్నారన్నారు. మైదానంలోని బెంచీలు, ఓపెన్ జిమ్ పరికరాలు దెబ్బ తిన్నాయన్నారు. రైల్వే జిమ్ ఆధునీకరణ పేరుతో బంద్ చేసి దాదాపు తొమ్మిది నెలలవుతోందన్నారు. సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.